క్లుప్తంగా

డెప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌గా రుూన్సీ



గుంటూరు లీగల్: గుంటూరు న్యాయ సేవ సంస్థలో డెప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌గా న్యాయవాది ఎస్.బి.ఎ.రుూన్సీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రుూన్సీకి పలువురు లీగల్ డిఫెన్స్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయ తిరునాళ్ల

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు వాకింగ్ ట్రాక్(ఆంజనేయపేట) ఎదురు వేంచేసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వాముల వారి తిరునాళ్ల ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కన్నసాని విజయకుమార్(రాజా) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ శుక్రవారం ఉదయం ఆరు గంటలకు నెల పొంగళ్లు, అమ్మవారికి కుంకు మార్చన, 15వ తేదీ స్వామివార్లకు అభిషేకం, ఊరేగింపు, 16న ముత్తైదువులకు పసుపు, కుంకుమ గాజులు పంపిణీ చేయడం, 17న చండీ హోమం, 18న మహా అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు హాజరై, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన తెలిపారు.

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ స్మృతికి నివాళి



లక్ష్మీపురం: తెలుగు జాతి పద కవితా వారసత్వ సంపదను అందించిన దీపధారి, గంధర్వుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం గరిమెళ్ల బాల కృష్ణ ప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గరిమెళ్ల శిష్యురాలు శారద, గాయని యార్లగడ్డ లక్ష్మీరాజేశ్వరి, మల్లేశ్వరరావు, పీఎస్ మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా ఆర్ అగ్రహారంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామిదేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోపణ, వాస్తు హోమం, ధ్వజ పటాధివాసం కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్యనాయుడు, దాసరి భాస్కరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

నగరంపాలెం: కుమార్తె అదృశ్యంపై తండ్రి పాతగుంటూరు పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాత గుంటూరు మణిహోటల్ సెంటర్‌కు చెందిన పి.కోటేశ్వరరావు తన కుమార్తె మంగళవారం డీమార్ట్‌కు వెళ్లివస్తానని చెప్పి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి కొనుగోలుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

లక్ష్మీపురం: మిర్చి కొనుగోలుకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాక పోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన మహంకాళి అనే వ్యక్తి మిర్చి యార్డు వద్ద కమీషన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 4వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి నంద్యాలలో మిర్చి కొనుగోలు కోసం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య జ్యోతి బంధుమిత్రులను, సన్నిహితులను విచారించగా ఎంతకు జాడ తెలియక పోవడంతో భార్య జ్యోతి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నగరంపాలెం: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని పల్నాడు బస్టాండ్ వద్ద బుధవారం గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని జీజీహెచ్ శవాగారంలో భద్రపరిచారు. మృతునికి సుమారు 60 ఏళ్ల వయసు ఉంటుందని, నల్లని రంగు టీషర్టు, ప్యాంట్ ధరించి ఉన్నాడని లాలాపేట పోలీసులు తెలిపారు. మృతుని ఆనవాళ్లను ఎవరైనా గుర్తిస్తే లాలాపేట పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

కిడ్నీలకూ.. ముంచుకొస్తున్న ముప్పు

నేడు వరల్డ్ కిడ్నీ డే

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న కిడ్నీ సమస్యలు
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు
- రోగులకు అందుబాటులో ఆధునిక వైద్యం



గుంటూరు మెడికల్: మన శరీరంలో కిడ్నీలు ఎంతో కీలకం. చిక్కుడు గింజ ఆకారంలో ఉండే కిడ్నీలు ప్రతిరోజూ నిరంతరం రక్తాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. ఆధునిక జీవనశైలికి అలవాటు పడటంతో కిడ్నీ బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2006 నుంచి ప్రతి ఏడాది మార్చి నెల రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డేని నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు...

కిడ్నీ వ్యాధి బారిన పడిన వారిలో ముఖం, కాళ్ల వాపులు కనిపిస్తాయి. ఆయాసం, అలసటగా ఉంటుంది. పనిమీద ఏకాగ్రత తగ్గటం, ఆకలి మందగించటం జరుగుతుంది. మూత్రం రాత్రి వేళల్లో ఎక్కువసార్లు రావటం, కొన్ని సందర్భాల్లో మూత్రం సరిగా రాకపోవటం, మూత్రంతో పాటు రక్తం కారుతుంది. మూత్రం పోసేటప్పుడు చురకు, మంట లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే కిడ్నీ వైద్యుడిని సంప్రదించాలి.

హైరిస్క్ వారు జాగ్రత్తగా ఉండాలి...

బీపీ, షుగర్ ఉన్నవాళ్లు హైరిస్క్ గ్రూప్‌నకు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. షుగర్ సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడవుతాయి. ఊబకాయం ఉన్నవారు జబ్బున పడే ప్రమాదం ఉంది. జీనవశైలిలో వచ్చిన మార్పుల వలన 20 ఏళ్లు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు జబ్బు బారిన పడుతున్నారు. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

బాధితులు అధికమే...

ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒక కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. జిల్లాలో 20 మంది కిడ్నీ వైద్యనిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద ప్రతిరోజూ 30 నుంచి 50 మంది కిడ్నీ సమస్యలతో చికిత్స పొందుతున్నారు. చిన్న పిల్లల్లో కిడ్నీ జబ్బులు రావటంపై నెఫ్రాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధి బారిన పడకుండా ...



క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చక్కెర శాతాన్ని, అధిక రక్తపోటులను నియంత్రణలో ఉంచుకోవాలి. ఆరోగ్య కరమైన ఆహార నియమాలు పాటించాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఇష్టం వచ్చిన రీతిలో మందులు వాడకూడదు. పొగ, మద్యం తాగడం లాంటి దురాలవాట్లుకు దూరంగా ఉండాలి. పరిమితమైన ఆహారం, ఉప్పు తగ్గించి వాడటం, ఎక్కువగా నీటిని తాగటం చేయాలి.

–డాక్టర్ అన్నపురెడ్డి శివనాగేంద్రరెడ్డి, నెఫ్రాలజిస్ట్, గుంటూరు

ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయాలి



కిడ్నీ జబ్బులను నివారించేందుకు జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించం ద్వారా డయాలసిస్ వరకు వెళ్లకుండా నిరోధించు. ఏపీలో సుమారు 40 లక్షల మంది బీపీ, షుగర్ జబ్బులతో బాధపడుతున్నారు. బాధితుల సంఖ్య తగ్గించేందుకు, కొత్తగా బాధితులు రాకుండా నిరోధించేలా ప్రతి ఒక్కరికి కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు ప్రాథమిక దశలోనే చేయించేలా ప్రభుత్వాలు చొరవ చూపించాలి. ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేస్తే జీవితకాలం 20 ఏళ్లవరకు పొడిగించవచ్చు.

–డాక్టర్ చింతారామకృష్ణ, నెఫ్రాలజిస్టుల సంఘం రాష్ట్ర మాజీ సెక్రటరీ, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



జీజీహెచ్‌లో కిడ్నీ రోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల కంటే ధీటుగా ఆధునిక వైద్య సౌకర్యాలతో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాం. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో ఉచితంగా చేసి నూతన జీవితాలను ప్రసాదిస్తున్నాం. ప్రతిరోజూ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య 60 నుంచి 70 వరకు ఉంది. వీరే కాకుండా ప్రతి రోజూ 50 మందికి పైగా రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. పాజిటివ్ కేసులకు కూడా జీజీహెచ్‌లో డయాలసిస్ చేసే సౌకర్యం ఉంది. ఆస్పత్రిలో 24 గంటలూ డయాలసిస్ వైద్యసేవలు జరుగుతూనే ఉంటాయి.

–డాక్టర్ గొంది శివరామకృష్ణ, నెఫ్రాలజి విభాగాధిపతి, జీజీహెచ్, గుంటూరు

హోటల్స్ వ్యర్థాలు నేరుగా డ్రెయిన్‌లోకి వదలకూడదు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో హోటల్స్ తప్పనిసరిగా వ్యర్థాలను డ్రెయిన్‌లోకి నేరుగా పంపకుండా మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ రైలుపేట ప్రభుత్వ సమగ్ర వైద్యశాల ఎదుట రోడ్, డ్రెయిన్లపై ఆక్రమణలు, హోటల్స్ వ్యర్థాలు డ్రెయిన్లలోకి నేరుగా రావడం గమనించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హోటల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా వ్యర్థాలను డ్రెయిన్‌లోకి పంపే మార్గంలో మెష్ ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈలు నాగభూషణం, మధుసూదన్, ఎస్ఎస్ ఆయూబ్‌ఖాన్, కార్పొరేటర్ పి.సమత, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

15లోగా మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు చెల్లించాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డ్స్ నిర్వాహకులు ఈ నెల 15లోపు బకాయిలు మొత్తం చెల్లించాలని, చెల్లించని వారి బోర్డ్‌లను 16వ తేదీ నుంచి తొలగిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణం, ప్రజారోగ్యానికి భంగంగా పరిణమించిన నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని గుంటూరు నగరంలో నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది, ప్రజలు సంయుక్తంగా కృషి చేస్తేనే నిలువరించగలమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఐటీసీ మిషన్, బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో గుంటూరు నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులకు ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల నిర్వహణ, హోమ్, క్లస్టర్ కంపోస్ట్ తయారీ అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ స్టేట్ ప్రమోటింగ్ ఆఫీసర్ కృష్ణ వీరవర్మ, స్వచ్ఛ భారత్ మిషన్ రిసోర్స్ పర్సన్ సునంద, ఏఎన్‌యూ ఎన్విరాన్మెంట్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ బ్రహ్మాజీ, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, గ్రీన్ కోర్ జిల్లా బాధ్యులు తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి వద్ద డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందివడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగ అవుట్ సోర్సింగ్ కార్మికులు కె.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కళ్యాణికి రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌ను బుధవారం కమిషనర్ చాంబర్‌లో అందజేశారు.

విలీన గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) ద్వారా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని, అందుకు తగిన విధంగా పబ్లిక్ హెల్త్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు డీపీఆర్‌లు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో యూఐడీఎఫ్ నిధుల ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్య తీర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. నగర పరిధిలో తాగునీటి పథకాల అమలు కోసం రూ.186.42 కోట్లు కేంద్ర నిధులు మంజూరు అయ్యాయన్నారు.

బకాయిదారుల ట్యాప్ కనెక్షన్లు తొలగించాలి

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారుల గృహాల, వ్యాపార సంస్థల ట్యాప్ కనెక్షన్‌లు తొలగించి, ఆస్తులను సీజ్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆస్తి పన్ను వసూలుపై రెవెన్యూ విభాగం, విభాగాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగర పాలక సంస్థకు మూడేళ్లకు పైగా ఆస్తి పన్ను బకాయి ఉన్న వారి నివాసాలకు ట్యాపులు తొలగించటం, ఆస్తుల సీజ్ చేయాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

రాజకీయ వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలి

ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

లక్ష్మీపురం: ఆశ వర్కర్‌పై రాజకీయ వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నం చేసి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సామ్రాజ్యంను సీఐటీయూ బృందం బుధవారం పరామర్శించింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం అత్తలూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉంగుటూరు గ్రామానికి చెందిన ఆశ వర్కర్ రాయపాటి సామ్రాజ్యంపై రాజకీయ కారణాలతో తొలగించాలని 200 మందికి పైగా పిహెచ్‌సి వద్దకు వచ్చి వేధింపులు గురి చేయటం కారణంగా గత్యంతరం లేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ధనలక్ష్మి మాట్లాడుతూ సామ్రాజ్యం ఆమె నిర్వహిస్తున్న విధులు లోపాలు ఏమైనా ఉంటే పరిశీలించాలి కానీ రాజకీయ కారణాలతో 200 మందిని తీసుకొచ్చి తీసివేస్తారా లేదా అని బెదిరిస్తే మహిళ అయి ఉండి ఏమి చేయాలో పాలు పడక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, ఇది అత్యంత బాధాకరమైన విషయం అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు, పలు సంఘాల నాయకులు జి.రమణ, శివకుమారి, కె.లక్ష్మి, కే శ్రీనివాసరావు, బి.సూరిబాబు, ముత్యాలరావు, బి.లక్ష్మణరావు, ధనలక్ష్మి, కే జ్యోతి, రేణుక, ప్రమీల, సుమతి, నాగమణి,సమీర్ పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో ఆశ వర్కర్ సామ్రాజ్యంను పరామర్శిస్తున్న నాయకులు

కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

లక్ష్మీపురం: నగరంలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఇల్లు లేని నిరుపేద ప్రజలకు రెండు సెంట్లు స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు వెంటనే విడుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక 54వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ 9వ లైన్ వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం అర్జీలు స్వీకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి స్థానిక 158వ వార్డు సచివాలయ కార్యదర్శికి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నూతలపాటి వెంకటేశ్వరావు, ఆకిటి అరుణ్ కుమార్, బందారపు మెర్సీ, నూతక్కి మేఘన, బందారపు యశ్వంత్ (శశి), జంగాల చైతన్య, వి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్యదర్శికి అర్జీలను అందజేస్తున్న దృశ్యం

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, బలిహరణ, నిత్య హోమం, మంత్ర హోమం, పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉభయదేవేరి సమేతులైన స్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితుల ఆధ్వర్యంలో దంపతులతో కల్యాణం చేయించారు. సాహితీవేత్త నోరి కోదండరామ్ వ్యాఖ్యతగా వ్యవహరించగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య అధ్యక్షత వహించారు. శ్రీవశిష్టాశమ ఉత్తర పీఠాధిపతి సర్వ అధికార ప్రతినిధి విశ్వంభరానందగిరిస్వామి(కారంచేడు) అనుగ్రహభాషణం చేస్తూ వామనమూర్తి, బలిచక్రవర్తి కథను వివరించారు.బ్రహ్మోత్సవాల విశిష్టత, నిత్య కళ్యాణ మూర్తియై శ్రీ వేంకటేశ్వర స్వామివారి విశేషాలను సాహితీవేత్తలు నారాయణం ప్రసాదాచార్యులు, నారాయణం శేషుబాబు వివరించారు. మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నూరుపనేని శ్రీరామచంద్ర మూర్తి, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి పాల్గొనగా, అతిథులను, స్వామిజీలను సత్కరించారు.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: 11 కేవీ ప్రగతినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ పి.హెచ్.ఖాన్ బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ప్రగతి నగర్ సగభాగం, రాజీవ్ గృహకల్ప, బాలాజీ నగర్ 0 లైన్ నుండి బాలాజీ నగర్ 7వ లైను వరకు, బాలాజీ నగర్ 9వ లైన్ కొంత భాగం, అంబటి రామయ్య నగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు గమనించాలని కోరారు.

15న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

లక్ష్మీపురం: విద్యారంగ సమస్యల మీద విజయవాడ ధర్నా చౌక్ వద్ద మార్చి 15న నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, నగర కార్యదర్శి యశ్వంత్, నగర సహాయ కార్యదర్శి సుభాని, నగర గర్ల్స్ కన్వీనర్ సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి

ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గుంటూరు ఎడ్యుకేషన్: సమయపాలన, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి మూల స్తంభాలని, పదో తరగతి విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో బుధవారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ అపారమైన శక్తి ఉందని, దానిని గుర్తించి ముందుకు సాగాలని సూచించారు. జీవిత నిర్మాణానికి, మానవత్వ వికాసానికి, వ్యక్తిత్వ పరిపూర్ణతకు విద్య తోడ్పడుతుందని చెప్పారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాలు ఉండాలని, ఆ లక్ష్యం కోసం ఎంతటి కష్టమైనా ప్రయత్నించాలని సూచించారు. ప్రతి ఏడాది మాదిరిగానే జైన్ హై స్కూల్ విద్యార్థులు పదో తరగతిలో రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జైన్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్ను మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో 586 మార్కులు సాధించిన తమ విద్యార్థులు ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అవసరమైన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ పాల్గొన్నారు.



విద్యార్థినికి ఎగ్జామ్ కిట్ అందజేస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎండీ మున్ను

కౌలు రైతుల ఆత్మహత్యలను నివారించాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య
- సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలల కాలంలో 180 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే అందులో 90 శాతం కౌలు రైతులు ఉన్నారని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి సంఘం అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి అధ్యక్షత వహించారు. జమలయ్య మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు గుర్తింపు కార్డు లేదని, గుర్తించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. కౌలురైతుల ఆత్మహత్యలను గుర్తించి బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల సాగు కోసం తీసుకున్న బ్యాంకు మరియు ప్రైవేటు అప్పులను మాఫీ చేయాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం మాట్లాడుతూ భూయజమాని ప్రమేయం లేకుండానే గ్రామ సభలలో నేరుగా కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్‌లో కూడా కౌలు రైతులను నమోదు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గుంటూరువారితోటలోని శ్రీపులిపాక కమలా హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు బుధవారం మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ అవగాహనతోనే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించగలమని అన్నారు. మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, నిత్యజీవితంలో ఎంతో మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా మాదక ద్రవ్యాల కు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, కౌన్సెలింగ్, డి–అడిక్షన్ సెంటర్లకు పంపించడంలో ప్రతి ఒక్కరు తమ వంతు సామజిక బాధ్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చు అని అన్నారు నీతోడు మానసిక వికాస కేంద్ర జోనల్ సమన్వయకర్త కె.ప్రియాంక మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం జరుగుతోందని, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లకు బానిసలుగా మారిన యువత ఎక్కువ శాతం ఉన్నారని తెలిపారు. వివరాలకు 9490492020 నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయకర్త బి.రమేష్, ఎంఈవోలు బీవీ రమణయ్య, కె. జ్యోతికిరణ్ పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలతో వాటిల్లే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న శేఖర్‌బాబు

చెట్టుపై గొడ్డలి వేటు

గుంటూరు లీగల్: గుంటూరు నగర వాసులకు ప్రాణవాయువుని అందించే చెట్లు నేలకొరుగుతున్నాయి. వివరాలు... ఎవర్ గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్ పేరిట గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి గత ఆరు ఏళ్లుగా శ్యామల నగర్ పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున మొక్కలు పెంచుతున్నారు. మొక్కల సంరక్షణ కోసం ప్రతినెలా రూ.60 నుంచి రూ.70 వేలు ఖర్చు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం పట్టాభిపురం రైల్వే గేట్ నుంచి డీఆర్ఎం నివాసానికి వెళ్లే రహదారి పక్కన మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి చెట్లుగా రూపాంతరం చెందుతున్న సమయంలో గొడ్డలి వేటుకు గురయ్యాయి. ఇటీవల సంబంధిత రహదారి పునర్నిర్మాణంలో భాగంగా ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి వేశారు. ఓ పక్క ప్రభుత్వం మొక్కలు పెంచండి మహా ప్రభో అంటూ నెత్తి నోరు బాదుకుంటూ చెబుతున్నప్పటికీ, ఉన్న చెట్లను నరికి వేయడం విడ్డూరం.



రోడ్డు నిర్మాణం చేస్తూ ఏపు పెరిగిన చెట్లను నరికి వేసిన దృశ్యం (ప్రస్తుత చిత్రం)